# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఇజ్రాయెల్ తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి ఆ దేశ ప్రధానితో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఫోన్ సంభాషణ జరిపారు.
- రోడ్డు నిర్మాణంలో బయో-బిటుమెన్ మిశ్రమాన్ని వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసిన మొట్టమొదటి దేశంగా భారత్ అవతరించింది.
- ఐరోపాతో భారత్ సంబంధాలు ఈ ఏడాది మరింత మెరుగవుతాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చెప్పారు.
- ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రేపు ఉదయానికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో ఈరోజు ఫోన్‌లో మాట్లాడారు. భారత్-ఇజ్రాయెల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఉన్న మార్గాలను ఈ సందర్భంగా చర్చించారు. ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలు, లోతైన పరస్పర విశ్వాసం, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని భారత్-ఇజ్రాయెల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఉమ్మడి ప్రాధాన్యతలను ఇరువురు గుర్తించారు. ఉగ్రవాదం పట్ల నాయకులిద్దరూ తమ జీరో టాలరెన్స్ విధానాన్ని పునరుద్ఘాటించారు. ఇద్దరు నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు కూడా ఇచ్చిపుచ్చుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రోడ్డు నిర్మాణంలో బయో-బిటుమెన్ మిశ్రమాన్ని వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసిన మొట్టమొదటి దేశంగా భారత్ అవతరించింది. బయో-బిటుమెన్ ముడి చమురు ద్వారా ఉత్పత్తి చేయబడిన నల్లని హైడ్రోకార్బన్‌ల జిగట మిశ్రమం. ఇది రోడ్డు నిర్మాణంలో కీలకమైన బైండర్‌గా పని చేస్తుందని, ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన తొలి దేశంగా భారత్ నిలుస్తుందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. న్యూఢిల్లీలో

ఈరోజు జరిగిన CSIR సాంకేతికత మార్పిడి కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... ఈ చారిత్రాత్మక మైలురాయిపై CSIRను అభినందించారు. పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించడంలో ఈ చొరవ సహాయపడుతుందన్నారు. వికసిత్ భారత్ 2047 దార్శనికత వైపు బయో-బిటుమెన్ ఒక పరివర్తనాత్మక అడుగు అని నితిన్ గడ్కరీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) నిర్మిస్తున్న బెంగళూరు-కడప- విజయవాడ ఎకనామిక్ కారిడార్ NH-544G రెండు గిన్నిస్ రికార్డులను సాధించింది. కేవలం 24 గంటల్లోనే 28.95 కిలోమీటర్ల మేర 10 వేల 675 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్ వేయడం ద్వారా ఈ రికార్డ్ లు నెలకొల్పింది. ఈ విషయాన్ని NHAI సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలియయజేస్తూ... ఈ కారిడార్ కర్ణాటక - ఆంధ్రప్రదేశ్ ల మధ్య అంతర-రాష్ట్ర అనుసంధానాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

గత కొన్ని దశాబ్దాలుగా భారత్ కు వ్యతిరేకంగా పాకిస్తాన్ ఉగ్రవాదానికి మద్దతునిస్తూ.. శిక్షణా శిబిరాలను నిర్వహించడానికి చేస్తున్న ప్రయత్నాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. లక్సెంబర్గ్ లో జరిగిన ప్రవాస భారతీయుల సమావేశంలో ప్రసంగిస్తూ.. మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ స్నేహపూర్వకంగా ఉండే దేశాలతో ఒక రకంగానూ పాకిస్థాన్ వంటి దేశాలతో మరోలా వ్యవహరిస్తుందని జైశంకర్ స్పష్టం చేశారు.

(వాయిస్ 29 సెకన్లు)

అదే విధంగా వ్యాపార, సాంకేతిక రంగాలలో లక్సెంబర్గ్‌తో భారతదేశ భాగస్వామ్యం గణనీయంగా బలపడిందని చెప్పారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో భారతీయ ప్రవాసుల సహకారాన్ని కూడా మంత్రి ప్రశంసించారు. ఇక ఐరోపాతో భారత్ సంబంధాల గురించి జైశంకర్ మాట్లాడుతూ... ఐరోపాతో సంబంధాలు ఈ సంవత్సరం మరింత మెరుగుపడతాయని, యురోపియన్ యూనియన్ తో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని భారత్ భావిస్తోందని చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో 26 మంది మావోయిస్టులు ఈరోజు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారిలో 13 మందిపై 65 లక్షల రూపాయల రివార్డ్ కూడా ఉంది. పోలీస్ సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపిన వివరాల ప్రకారం, ఏడుగురు మహిళలు సహా 26 మంది ఎదుట లొంగిపోయారు. వీరంతా పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (PLGA) బెటాలియన్, సౌత్ బస్తర్ డివిజన్, ఆంధ్ర-ఒడిశా బోర్డర్ డివిజన్‌లో గత కొంత కాలంగా చురుగ్గా ఉన్నారని ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, ఒడిశా సరిహద్దు ప్రాంతాలలో అనేక హింసాత్మక సంఘటనలలో వీరు పాల్గొన్నారని కిరణ్ చవాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస విధానంతో ఈ మావోయిస్టులందరూ ఆకర్షితులయ్యారని, లొంగిపోయిన వారందరికీ ఒక్కొక్కరికి 50 వేల రూపాయల సహాయం అందించామని, ప్రభుత్వ విధానం ప్రకారం వారికి మరింత పునరావాసం కల్పిస్తామని ఎస్పీ కిరణ్ చవాన్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ జౌళి మంత్రుల సదస్సు-2026 అస్సాంలోని గువహటి వేదికగా రేపటి నుండి ప్రారంభమవుతుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో వస్త్ర రంగంలో విధానాలు, పెట్టుబడులు, సుస్థిరత, ఎగుమతులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సాంకేతిక పురోగతులపై చర్చిస్తారు. 2030 నాటికి భారత్ ను ప్రపంచ జౌళి ఉత్పాదక కేంద్రంగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు జౌళి మంత్రిత్వ శాఖ పేర్కొంది. భారతీయ జౌళి పరిశ్రమ వృద్ధి, వారసత్వం, ఆవిష్కరణ అన్న ఇతివృత్తంతో జరుగుతున్న ఈ సదస్సు ఎగుమతుల పెంపు, ఉపాధి కల్పన, సమగ్ర అభివృద్ధిలపై దృష్టి సారించనుంది. ఈ సమావేశానికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల జౌళి శాఖ మంత్రులు, సీనియర్ అధికారులు హాజరవుతారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈనెల 12వ తేదీన PSLV C-62 ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. ఆంధ్రప్రదేశ్ శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈనెల 12వ తేదిన ఉదయం 10 గంటల 17 నిమిషాలకు ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించబోతున్నామని సామాజిక మాధ్యమ పోస్టులో ఇస్రో తెలియజేసింది. ఈ ఉపగ్రహం రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (DRDO) వ్యూహాత్మక ప్రయోజనాల కోసం రూపొందించబడింది. ఈ ప్రయోగం ద్వారా భారత్, ఇతర దేశాలకు చెందిన 18 సహ ఉపగ్రహాలను కూడా అంతరిక్షంలోకి పంపనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా ఉన్న 50 వేల ఆరోగ్య కేంద్రాలు జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలను పాటిస్తున్నాయని ప్రభుత్వం ధృవీకరించింది. నాణ్యమైన, సురక్షితమైన వైద్య సేవలను అందరికి చేరువ చేయడం ఇది ఒక కీలక అడుగు అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. 2024 జూన్ లో ప్రారంభమైన ఈ ప్రమాణాలు మొదట జిల్లా ఆసుపత్రులకు ఆ తర్వాత సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు విస్తరించబడ్డాయి. ప్రజారోగ్య కేంద్రాలలో అంతర్జాతీయ స్థాయి చికిత్స అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పురుషుల టీ20 ప్రపంచ కప్ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ట్రోఫీ పర్యటన ఈరోజు నేపాల్‌లో సాగింది. కాఠ్మాండులోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన బౌద్ధ స్థూపం వద్ద ఈ ట్రోఫీని ప్రజల సందర్శనార్థం ప్రదర్శించారు. అంతకుముందు కాఠ్మాండులోని శీతల్ నివాస్‌లో ట్రోఫీని ఆవిష్కరించిన నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్, టీ-20 ప్రపంచ కప్ ట్రోఫీ నేపాల్‌కు రావడం తమ దేశానికి గర్వకారణమన్నారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న 2026 టీ-20 ప్రపంచ కప్ వచ్చే నెల 7వ తేదీ నుండి మార్చి 8 వరకు జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంక సమీపంలోని ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడిందని, ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ రేపటికి నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. ఇది తదుపరి 48 గంటల్లో తమిళనాడు తీరం వైపుగా కదిలి తీవ్ర వాయుగుండగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. ఇక పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఒడిశా, రాజస్థాన్లలో రానున్న రెండు రోజుల్లో తీవ్ర చలిగాలులు వీస్తాయని IMD తెలిపింది. రేపు మధ్యప్రదేశ్, జార్ఖండ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లో కూడా చలిగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్‌లో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 3 డిగ్రీల వరకు తగ్గుతాయని IMD శాస్త్రవేత్త స్వర్ణాళి మజుందార్ వెల్లడిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

======================

======================